మహా సముద్రం

★

శ్రీ అంగర వెంకటకృష్ణారావు

రెండురోజులు కలయిక వేళ. జీవితం అనే తెరమీద మృత్యుదేవత ప్రతిబింబం మూగగా నాట్యం ప్రదర్శిస్తూన్న సమయం. అరరాత్రి! నే నీ కథానిక లోని వుద్విగ్నతా నిధానకమైన సంఘట్టనలు క్రోడీకరించ డానికి కలం యెత్తిన ఆ క్షణంలో నాముందొక దృశ్యం గోచరించింది.

దూది పింజల వంటి మబ్బు తునకల వెనకనుండి వచ్చే మసక, మసక వెన్నెలకి మెరిసే యిసిక; చీమ చిటుకనని ఆ రాత్రిలో దెబ్బతిన్న సింహ గర్జన వలె సముద్రపు హోరు, అవధిలేని, అపులేని ప్రచండ వాయువు. విశాఖపట్టణ సముద్రతీరం.

ఆ భయంకర వేళ, అస్తి నాస్తి అనిపించే వెలుగులో, కరకర యిసిక త్రొక్కుకుంటూ, నిర్లక్ష్యపు పరుగుతో, నీటివరకూ వచ్చి, వొక స్త్రీ ఆగిపోయి చందమామ వేపు చూసింది. కరిగిన బంగారువంటి వెన్నెలలో ఆ సుందరముఖి గులాబీ బుగ్గలమీద విద్యుద్దీప కాంతికి బేసరిలో వెలిగే వజ్రపు రాయిలా వొక కన్నీటి చుక్క మెరిసింది.

'ఈమెచేత ఆత్మహత్య చేయించబోతున్నావా ?' నా కలం నన్ను ప్రశ్నించింది. నేను కలం క్రిందపెట్టి, తల గోక్కున్నాను. ఆ ప్రశ్నకు సమాధానం ఆస్త్రీయే యివ్వాలి. నేను నా పాత్రలను ఆజ్ఞ పెట్టను. అవే వచ్చి తమ విధి నిర్వహిస్తాం టే, నేను వ్రాస్తూంటా, చూసినది చూసినట్టూ. విన్నది విన్నట్టూ.

చేతి గడియారం టిక్కు టడుగులతో పది నిమిషాల దూరం పరుగెత్తింది. నా కలం లేచి తిరిగి పని చెయ్య జొచ్చింది. అక్కడ లేడి దూసుకు పారిపోయిన సింహగర్జనలా తెరంగాలు హోరెత్తుతున్నాయి.

*   *   *   *   *

టెలిగ్రాం చదువుకుని అరుణ యెగిరి గంతు వేసింది. మరునాడు కెప్టెన్ బాలీ వస్తున్నాడు.

మద్రాసు మెయిలుకు వెళ్ళి అతనిని యెదుర్కోవాలి. అంచేత వెంటనే కారు పంపమని తండ్రికి 'ఫోను' చేసింది. కారు వచ్చింది. ఆమె, యెన్నెన్నో చీరలు, చొక్కాలు మార్చి, చివరకెలాగో డ్రెస్ వేసుకుంది. 'కష్' కటువుగా వుంటుందనీ, 'ఆటో దిల్బహార్' అల్లరి చేస్తుందనీ, 'జాస్మిన్' ఘాటుగా వుంటుందనీ సెంటు సీసాలు పలపల పెట్టె అడుగున కుక్కి, పునుగు తీసి రెండు కనుబొమలకు దిద్ది, శేషం మిలమిల మెరిసే తలమీద వ్రాసి, తన 'గమగమ'కు మైమరచి పోయింది. చివర కెలాగో శీతాకోక చిలుకలా తయారై, కారుమీద హుషారా వెళ్లింది.

మెయిలు వచ్చింది. జన సమర్దాన్ని త్రోసుకుంటూ ఆతృతగా మొదటి తరగతి పెట్టెల వద్దకు వెళ్లి చూసింది. ఆమె మనసు చిన్నబోయింది. బాలీ రాలేదు. ఎల్లప్పుడూ వేలకొలదీ జనం వుండే హుషారా స్టేషను నిర్మానుష్యంగా తోచిందామెకు. మెల్లగా వచ్చి కారులో కూచుంది. 'అమ్మగారూ! డాక్టరు బాబు రాలేదా' అని డ్రైవరడిగేడు. బుంగమూతి పెట్టి లేదంది. కారు గృహోన్ముఖమయింది.

అరుణ తన గదిలోకి వెళ్లి నిస్సహాయంగా కూలబడిపోయింది. ఎదురుగుండా నిలువుటద్దంలో తన నిండు రూపం చూసినప్పుడామె కళ్లల్లో నీళ్లు తిరిగేయి. ఆ ఆశాభంగాని కామె చాలా నొచ్చుకుంది.

భోజనం అలా యిలా చేసి, సోఫాలో కూచుని టెలిగ్రాం తిరగవేసింది. తను చూడడంలో పొరపాటు లేదు. బాలీ యెందుకు రాలేదో తెలియలేదు ఆమె మనసు పరిపరి విధాల పోయింది.

మధ్యాహ్నం మూడు గంటలకు ఆమె తండ్రి

హీరాలాల్ ఘోషాల్ కోర్టునుండి యింటికి వచ్చేరు. ఘోషాల్ గారు కలకత్తా హైకోర్టులో న్యాయాధికారి. ఆయన జూడిషల్‌లో పంజాబ్, ఉత్తర ప్రదేశం, మధ్య భారతం రాష్ట్రాలలో చాలా సర్వీసు చేసి, అప్పటికి కలకత్తా వచ్చి వొక యేడాది కావస్తూంది. శ్రోత్రియ కుటుంబి, జపి. కేవలం శాఖాహారి. ఆయన అరుణముఖం వాడి వుండడం చూసి కుశలం అడిగేరు. అరుణ నిరుత్తరంగా టెలిగ్రాం అందిచ్చింది.

"మరిచి పోయేనమ్మా. బాలీ రాలేదా?" ఆమె లేదని చెప్పింది.

'అతడు మిలిటరీ మనిషి, హుకుమ్ కేతా జేదార్! మకెటు వెళ్లమని ఆర్డర్లు వచ్చేయో! లేక త్రోవలో ఎవరైనా కలిసి బలవంతంగా దింపి వేసేరో! తెలుస్తుందిగా. సాయంత్రానికి తిరిగి యేదో తెలియవచ్చు!"

మొదటి మాట లామెను కొంచెం అనునయించినా చివర మాటలు గాభరా పెట్టేయి.

మరొక తరంగం దెబ్బతిన్న త్రాచులా లేచి తీరాన్ని పెడిల్లని మోదింది. నేనటు గతుక్కుపడి చూసేను, తెలి మేఘాలలో పరుగెడుతూన్న చంద్రుడి కాంతి విరిగిన కెరటాల నీటి బిందువులలో కరిగిన బంగారులా మెరిసింది. ఆ స్త్రీ ముఖంమీద శాంతి కాంతులు వెల్లి విరిసేయి. హటాత్తుగా రంగం మారింది.

* * * * *

"బాలీ! నా కోరిక చెల్లించావే!"

'కోరి కేమిటి? నీది అజ్ఞ! నీకెలా తెలిసింది రమా నే వస్తున్నానని?'

భవాని జవాబిచ్చింది. 'రమకు కలలు కనడంలో మంచి నేర్పు వుంది. రాబోయే కాలం సాధారణంగా రమ స్వప్న ప్రపంచంలో వర్తమానం. బహుశా మీరు వస్తున్నారని నిన్నరాత్రి కలగని వుంటుంది." బాలీ పకపక నవ్వేడు—రమ చిన్నగా నవ్వింది.

భవాని రామరాజ్ తలా స్టేషను మాస్టరుగారి కూతురు. రమ సహాధ్యాయిని. వీళ్ళిద్దరూ కలకత్తాలో 'మెడిసిన్' చదువుతున్నారు.

'రమ చాలా పెంకెది సుమండీ. మా స్వస్థానం జలంధరులో మేం యిరుగు పొరుగు. ఈమె నాకంటె మూడేళ్లు గావును చిన్న. చిన్నప్పుడు నాకంటె బలంగా వుండేది. నన్ను చావగొట్టేది.'

'భవానీ, బాలీ మాటలు నమ్మకు. పెరటి తలుపు గొళ్లెంపెట్టి నన్నక్కడ ఎవరూ రాకుండా కాపు వుండమనే వాడు. ఎవరైనా చూస్తే దెబ్బలు నాకే తగిలేవి. తప్పితే తను కోసిన జామి పండ్లలో నా కొక్కటైనా యిచ్చేవాడు కాడు.'

'అప్పు డేం చేసేదో తెలుసాండి? పైనబడి కోతిలా రక్కి, జుత్తుపీకి, చూశారూ యీ మండ మీద గాయం! ఇది ఆవిడ ప్రసాదమే ఇవిగో రెండు పళ్లూ!' ముగ్గురూ పకపక నవ్వేరు.

రోజూ రామ్‌రాజ్ తలాలో ఆగని మెయిలు ఆవేళ అనుకోకుండా అరగంట ఆగిపోయింది. బాలీ కూచున్న పెట్టె సరిగా స్టేషను మాస్టరు యింటి ముందు ఆగింది. వరండాలో కూచుని రమ, భవానీలు కబుర్లు చెప్పుకుంటున్నారు. అప్పుడు బాలీ వాళ్ల కంట పడ్డాడు. రమ తన కళ్లని నమ్మలేక పోయింది.

ఆవేళ వాళ్ళకి క్లాసు లేదు. అంచేత రమ భవానీ యింటికి వచ్చింది. వాళ్లిద్దరికీ ప్రాణస్నేహం. అందుకే తనయిల్లు కాకపోయినా బాలీని బలవంతాన దింపేసింది. అరుణకు టెలిగ్రాం యిచ్చిన సంగతి చెప్పినా, తనపట్టు విడువలేదు. 'రేపు కాలేజీకి శలవు పెడతాం. ముగ్గురం కలసి అరుణ వద్దకు వెడదాం' అతడు కాదనలేక పోయేడు.

భోజనానంతరం ముగ్గురూ యెదురుగా వున్న మామిడితోటలోకి వెళ్ళేరు. చెప్రాసీ వొక తివాసీ, కూజాతో నీళ్లూ, రెండుగ్లాసులు తెచ్చేడు. ముగ్గురూ కూచున్నారు.

అది ఏప్రిల్ నెల. ఎండ మండ పెడుతూ చంద్రడగాడ్పులు పుట్టిస్తూంది. ఆ తోటలో కొంత చల్లగా వుంది. చుట్టుపట్ల యెండిపోగా మిగిలిన చెరువుల నీటి మీంచి అప్పుడప్పుడు శీతల పవనం వచ్చి చెమ్మట బొట్లు నార్చి సేద దీరుస్తూంది.

'స్పెషల్ ట్రెయినింగుకు బెంగుళూరు వెళ్లేను. అది ముగియడానికింకా వారంపడుతుంది. ఈలోగా పఠ్హానులుగో పటాలం హెడ్ క్వార్టర్సు చిట్టగాంగు

నుంచి తంతి వచ్చింది తక్షణం రమ్మని. నన్ను 'ఇంఫాల్' పంపిస్తారని రహస్యంగా తెలిసింది.'

భ :— ఇంఫాల్! ఇంఫాల్ జపానీయులు రహస్యంగా తిరుగుతున్నారని పుకారుగా వుంది మీరు జాగ్రత్తగా వుండాలి.

ర : బాలీకేం భయం. బాలీ కండలు చూశారూ! పదిమంది జపానీయుల్ని ఆపోశనం పట్టగలడు.

భవానీ వళ్లు ఝల్లుమంది. ఆ రెండు గంటల కాలంలో అత డేమో ఆత్మబంధువైన ట్టయిందామెకు.

బా : కబుర్లు చెప్పడంకాదు రమా! నువ్వొస్తావా ?'

శ : భయమనుకున్నావా? నా చదు వింకా పూర్తికాలేదు. పైగా మన దేశంకోసం యుద్ధం చెయ్యవలసి వచ్చినప్పుడు నేను ముందుగా రణరంగంలోకి దూకుతాను.

బా : ఆ సమయం వచ్చినప్పుడు నిన్ను పిలకపట్టుకుని మేమే లాగుతాం రంగంలోకి. కాని అనుకోకుండా అంత అవసరం త్వరలోనే, యీ యుద్ధంలోనే యెందుకు కలగకూడదు ?

ర : అప్పుడు రంగంలోకి రెక్కలు కట్టుకు వాలతాను. కెప్టెన్ రమ వచ్చి కర్నల్ బాలీకి షేక్‌హాం డిస్తుంది.

బా : రాకపోతే ?

ర : గుండేసి కొట్టే.

బాలీకి నిలు వల్లా పులకాంకురాలు పుట్టేయి. భవానీ హృదయ మందిరంలో బాలీ పది టన్నుల బంగారు విగ్రహంవలె ప్రతిష్ఠయేడు.

తిరిగి సింహపు పంజా దెబ్బవంటి ఊర్మికా ప్రహారం పొందింది తీరం. నాహృదయంలోకూడా యేదో కల్లోలం బయల్దేరింది. రాబోయే సీను సాగర మథనం కామోా సనిపించింది.

* * * * *

ఉదయం సుమారు తొమ్మిది గంటలకు బాలీ, రమ, భవానీలు, అరుణయింటికి వెళ్లేరు. వాళ్లు వచ్చే ముందు అరుణ బాలీ పంపిన టెలిగ్రాం వేపు చూస్తూ యీజీ చైరులో కూచుంది. అప్పుడే ఆమె నీళ్లు పోసుకుంది. ఇంకా టీ, ఫలహారం పుచ్చుకోలేదు. టెలిగ్రాం కాగితంమీద ఆమె కళ్లనుండి నాలుగైదు అశ్రుబిందువులు టపటప జారేయి. అక్షరాలు కొంచెం చెదిరేయి.

బంట్రోతువచ్చి కెప్టెన్ బాలీ వచ్చేరని చెప్పేడు. ఆనందంతో అరుణ హృదయం కొట్టుకుంది. అప్రయత్నంగా ఆమె నేత్రాలు చెమ్మరించేయి.

గబగబ వెళ్లి అద్దంలో ముఖం చూసుకుంది. ఎప్పుడు చెదరగొట్టుకుందో జుట్టు సరిగా లేదు. నయన గోళాలలో అరుణ రేఖలు ప్రస్ఫుటంగా వున్నాయి. ముఖం వాడినట్టు గ్రహించింది. బాలీని యెదుర్కొన్నప్పుడు ధరించడానికి తను ఎన్నుకున్న చీర స్టాండు నే వుంది. పోనీ బాలీ తనకు క్రొత్తకాదు కదా, తన మూర్తి సాక్షాత్కారానికే చిటచిట వెన్నవలె, కరిగి పోతాడని మనస్సును సమాధాన పరుచుకోలేకపోయింది.

అర్థ నిమిష కాలంలో ఆమె హృదయం బంగారు పిచ్చుక గూడులా వూగిస లాడింది. బాలీ పెద్దగా కేకలు వేస్తూ వస్తున్నాడు. మరి రెండు ఆడ గొంతికలు, వికావిక నవ్వుతూ, వినిపిస్తున్నాయి.

'క్షమించు అరుణా. నిన్న నా వైరు ప్రకారం రాలేకపోయేను. ఆc!-వీరు మన స్నేహితులు. ఈమె రమామణీచావ్లా; యీ వూళ్లో పెద్ద వర్తకులు కుందన్‌లాల్ చావ్లా కూతురు. ఈమె భవానీ చక్రవర్తి; రామ్‌రాజ్‌తలా స్టేషన్ మాస్టరు పీయూష కాంతి చక్రవర్తి కుంతురు. ఈమె నా బాల్య స్నేహితురాలు, హైకోర్టు జడ్జీగారు హీరాలాల్ ఘోషాల్ కుమార్తె, నా కత్యంత ప్రియమైన అరుణా ఘోషాల్!

పరిచయం ముగిశాక రమ ముందుకు వచ్చి అరుణ చెయ్యిపట్టుకుని 'చెల్లీ అరూ! బాలీ నేమీ అనకు. ఆయనను త్రోవలోనే నే దింపేశాను. క్షమించు' అంది.

'అవును దిగకపోతే నన్ను చావ గొడుతుందేమో అని భయం.'

రమ పకపక నవ్వింది. భవాని మృదువుగా నవ్వింది. అరుణ బలవంతంగా పెదవులతో నే నవ్వ ప్రయత్నించింది.

రమను చూస్తూన్న కొద్దీ అరుణ హృదయంలో అవ్యక్తానుభూతి పొందుతూంది. తనకంటె ఆ పంజాబీ స్త్రీ నిర్వివాదంగా పొడగరి. ఆమె యౌవనం నిర్లక్ష్యంగా విజృంభించింది. నవ్వితే గది అంతా వెలుగుతో నిండి పోతూన్నట్టుంది. కండలు తిరిగిన బాలీ బహద్దర్ రూపానికి ఆ పాటి శరీరం లేకపోతే జోడు కుదరదని ఆమె శంకించింది. ఆమె కంటె తను కొంచెమే పొట్టిగా వున్నా, హృదయ దౌర్బల్యంవల్ల మరు గుజ్జువలె వున్నట్టు భావించుకుంది.

భోజనానంతరం బాలీ, భవానీ లొక సోఫాలోనూ, అరుణ, రమలు యెదుటి దానిలోనూ కూచుని బాతాఖానీ ఆరంభించేరు.

ర :-బాలీ నువ్వు జపానీయుల్ని చూసేవా?

బా :-ఖైదీలను చూసేను నాలుగైదు మార్లు. కాక్సస్ బజారు ప్రాంతంలో రెండు సారులు సైనికులు తారసపడ్డారు.

భ :-కాక్సస్ బజారు! అది మా అక్క అత్తవారి వూరు. ఆమ్మో! వాళ్లు మనదేశంలో కాళ్లు పెట్టేరన్నమాటే,

బా :-కాక్సస్ బజా రేమిటి? "రామూ" వరకూ కూడా వచ్చేరు. వాళ్లు గుంపులుగా రారు. ఒక్కొక్కరే వస్తారు.

ర :-అదేమిటి భవానీ అలా అంటావు! అడుగు, బాలీ యెంతమంది జపానీయుల్ని పట్టేడో.

ఆ మాటకు అరుణ మనసు మండింది. భవాని వణకిపోయింది. రెండు చేతులూ అప్రయత్నంగా జోడించి, హృదయ భాగాన్ని చేర్చి, గద్గదికతో 'అలా చెయ్యబోకండి' అంది. రమ అన్నది. 'నువ్వు చెప్పక్కరలేదు భవానీ, బాలీ ధైర్యం నాకు తెలీదూ? పలాయన మంత్రం పఠించడంలో ఆయన మొదటివాడు.'

ఈ సంభాషణ జరుగుతూన్నంతసేపూ కేవలం శ్రోతగావున్న అరుణ హృదయంలో యీ చివరి మాటలు బల్లెంవలె గుచ్చుకున్నాయి. ఆమెపై గల ద్వేషం ప్రజ్వరిల్లింది. రమ తిరిగి అంది 'జపానీయులు చాలా సాహసవంతులు. వాళ్లు యుద్ధరంగంలోకి వచ్చేటప్పుడు తల్లులు వారిని తిరిగి రావద్దంటారట. భార్యలు వెయ్యిమంది కన్యలచేత సూదిపోట్లు పొందిన బెల్టులు భర్తల నడుముకు చుట్టి పంపుతారట. అవి సహస్ర కన్యా కరస్పర్శచేత పవిత్రత కలిగి తుపాకీ గుండు నుంచి వారిని రక్షిస్తాయని వారి నమ్మకం. తల్లుల ఆశీర్వాదం, భార్యల రక్షాబంధం, అన్నిటికన్న మాతృదేశాన్ని కాపాడా లన్న ముఖ్య లక్ష్యం కలిగిన ధైర్య కేసరులు జపానీయులు.'

బాలీ రమ చేతులు పట్టి వూపి చిరునవ్వుతో, 'నీ కీ విషయా లెలా తెలిశాయి?' అన్నాడు.

అరుణ చివాలున లేచి, వరండాలోకి వెళ్లి వీధిలోకి చూస్తూ నిలబడింది. అది మిగిలిన వారంతా గమనించలేదు. రమ విరగబడి నవ్వుతూ బాలీ వీపుమీద దబదబ మోది 'నాకు దూరశ్రవణ దూరదృష్టి శక్తులున్నాయి తెలుసా?' అంది. ఆ దెబ్బలు తన వీపు మీద పడుతూన్నట్టు భావించింది అరుణ. అలా నవ్వుతూనే రమ యెదురుగా వున్న అద్దంవద్దకు వెళ్లి జుత్తు సరిచేసుకుంటూ 'పదండి. వూళ్ళో వెళ్ళి పడదాం.' అంది. బాలీ అరుణను తయారవమని కేక వేసేడు. అరుణ తనను విడిచి పెట్టమని కోరింది.

అలా వీల్లేదని ఆమె మాటలు జొరనీకుండా రమ వరండాలోకి పరుగెత్తి, క్రిందని తోటమూల కారుషెడ్డు ముందు నిల్చున్న డ్రైవరును కారు సిద్ధం చెయ్యమని హెచ్చరించింది. అరుణ బుంగమూతి పెట్టి యింకా వీధిలోకి చూస్తూంది. బాలీ ఆమె పక్క చేరి, 'అరుణ! ఏం అలా వున్నా' వని ప్రశ్నించేడు.

'ఎలా వున్నాను?'

'నే ననుకోనట్టుగా'

'నువ్వుకూడా నే ననుకోనట్టుగానే వున్నావు. అంచేత నే నిలా వుండడం విపరీతం కా దనుకుంటాను.'

బాలీకి ఆమె అంతర్యం పూర్తిగా అర్థం కాలేదు. కాని అతని బలవంతంమీద ఆమె యెలాగో బయలుదేరింది.

వాళ్లు మొదట '*The Great Eastern Hotel*' లోకి వెళ్లేరు. గుండ్రని బల్లచుట్టూ కూచోగానే హోటలునౌఖరు మొదట రమవద్దకు వచ్చి సలాముచేసి ఆజ్ఞాపించ మన్నాడు. తమ బృందంలో మిక్కిలి

ఆకర్షవంతమైన వ్యక్తి రమ అని తెలిసిపోయినట్టుబాధ పడింది అరుణ. మొదట బాలీ ప్రక్క కూచున్నది దిగ్గునలేచి, భవానిని అక్కడకు రమ్మని తాను ఆమె కుర్చీమీద కూచుంది. అదేమని బాలీ అడుగుతే, ఆ కుర్చీ పొట్టి అని జబాబు చెప్పింది. నిజానికి కుర్చీలన్నీ వొకేసైజువి. భేదం అంతా హృదయాల సైజులోనే.

కబుర్లు చెప్పుకుంటూ నలుగురూ ఐస్‌క్రీమ్ సేవిస్తున్నారు. బాలీ భవానీతో యుద్ధ విశేషాలు అదే పనిగా చెపుతున్నాడు. రమ నాలుగైదు చెంచాలు తింది. అరుణ వొక చెంచా రుచి చూసి ఆపుచేసింది. రమ నిమ్మళంగా తన కప్పులోని ఐస్‌క్రీమ్ కొంచెం కొంచెంగా బాలీ కప్పులోకి బదిలీ చెయ్యజొచ్చింది. మాటల సందడిలో అది గ్రహించక బాలీ తినివేయజొచ్చేడు. భవాని గ్రహించి ముసిముసి నవ్వు నవ్వుకుంది. అరుణ ఆ పాదమస్తకం మండిపోయింది. ఎంతసేపటికీ తన కప్పు ఖాళీకాకపోగా బాలీకి అనుమానం వేసి రమ వేపు చూసేడు. ఆమె కొంటెగా నవ్వింది.

బైటకు వచ్చి డ్రైవరును 'మైదాన్' మీద వేచి వుండమని, రమ అందర్నీ 'పారడైజ్ హాలు'కు పదమంది. అరుణ తలనొప్పి వచ్చిందని, తను సినీమా చూడలేననీ హీనస్వరంతో చెప్పింది. అయితే అంతా యింటికి పోదామన్నాడు బాలీ. కాని రమ, అరుణను బలవంత పెట్టింది. అరుణ రానని పట్టుపట్టింది. ఆమె నుదుటిమీద చెమటపోసింది. అది తుడుచుకునే నెపంమీద బలవంతంగా పైకుబుకుతూన్న కన్నీళ్లు రుమాలుతో తుడుచుకుంది.

చివరకు అరుణ యింటికి బయలుదేరింది. ఆమెకు సాయంగా తనుకూడా యింటికి మరలుతానని భవాని బయలుదేరింది. బాలీకి గొంతులో వెలక్కాయ పడింది. అతని చెయ్యి పట్టుగుని రమ లాగుతూ అరుణతో తొమ్మిదింటికి కారు పంపమంది. అరుణ హృదయమంతా గొంతులోచేరి గడ్డకట్టగా మాటరాక తలవూపింది అలాగే అన్నట్టు.

హటాత్తుగా అరుణకు శిరోవేదన కలిగినందుకు భవాని చాలావిచారించి తన వడిలో ఆమెను పడుకోబెట్టుకుంది. ఆమె వడిలో కళ్లు మూసిన అరుణ మానస నేత్రంలో యేవో దృశ్యాలు గోచరించేయి. ఆమె కెక్కడెక్కడివో పకపక నవ్వులు వినిపిస్తున్నాయి.

తిరిగి వొకపెద్ద కెరటం తీరాన్నిఢీకొంది. మబ్బు తునకలలోంచి చందమామ వడివడిగా పరుగెడుతూ ఆ స్త్రీ ముఖంపై కాంతి తరంగాలు ప్రసారించింది. ఆమె యెత్తిన ముఖం అలాగే వుంచి గగన కుసుమం వంటి చంద్ర గమనం గమనిస్తూంది. రంగం మారింది.

*   *   *   *   *

కెప్టెన్ రమ, మేజర్ బాలీ రంగూనులో వొక పెద్ద హోటలులో హటాత్తుగా కలుసుకున్నారు.

రంగూన్ ఆనాడే తిరిగి మిత్రమండలి వశమయింది. వేనకు వేలు సోల్జర్లు, నానా జాతివారూ నగరంలో విచ్చలవిడిగా తిరుగుతున్నారు. పోయిన జపానీయుల కన్న ఘోరంగా అత్యాచారాలు ఆనందం పేరిట చేస్తున్నారు. కడుపు చిచ్చు పశుప్రవృత్తిగా మారి పెదవిపై తెచ్చుకున్న మందహాసంతో 'రాక్షస రతి' అనుభవిస్తూంది.

నగరం దీపకోటితో మెరిసిపోతూంది. తినే వారితో, త్రాగే వారితో, ఆడే వారితో ఆ హోటలు ఒకే వొక సంతోషపు వెల్లువగా వుంది. తరతమతారతమ్యం లేకుండా ఆలివ్ యూని ఫారములు, ఖాకీ చీరలు, గౌనులు భుజాభుజీ ప్రవర్తిస్తున్నాయి. ఈ మానవత్వం మానంలేని, మానవ మన్యులనుండి దూరంగా వొకమూల, బాలీ, రమ కూచున్నారు.

రమను చూడగానే బాలీ అత్యాశ్చర్యపోయేడు. ఆమె షిల్లాంగు *I. M. H* నుండి ఆ తొలి నాడే విమానంలో వచ్చిందనీ, ఆ ఆస్పత్రియొక్క అడ్మిన్సు విభాగానికి అధికారిణిగా తనే స్వయంగా కోరుకుని వచ్చిందనీ తెలియగానే నిశ్చేష్టుడయేడు.

అక్కడనుండి యిద్దరూ లేచి బజారు వెంట నడవ జొచ్చేరు. త్రాగిన తెల్లసొల్జరొకడు తూగుతూ వాళ్లకెదురుగా వచ్చి, రమను ముద్దు పెట్టుకోబోయి ఆమె భుజద్వయంమీది పువ్వులు చూసి, వెనక్కుతగ్గి సెల్యూటు చేసి తన దారిని పోయేడు.

వాళ్లు బాలీ గది చేరేసరికి రాత్రి సుమారు

పన్నెండు గంటలయింది. అప్పుడు వాళ్లిద్దరిమధ్యా పెద్ద ఘర్షణ జరిగింది. ఆజాద్ హింద్ ఫౌజ్‌లో చేరడానికి వచ్చేనని రమ చెప్పింది. అది బాలీకి నచ్చలేదు. నేతాజీ చేస్తున్నపని తెలివి తక్కువదని అతడు వాదించేడు. రమకు కోపంవచ్చి కళ్లెఱ్ఱచేసింది. 'నే నా నాడు రామ్‌రాజ్ తలామామిడి తోపులో చెప్పలేదా? మాతృభూమికోసం పోరాడవలసిన సమయం వచ్చినప్పుడు రెక్కలు కట్టుకుని రంగంలో వాల్తానని. ఇప్పుడా సమయం వచ్చింది. అందుకే అక్షరాలా నా ప్రమాణం పూర్తిచేసేను.' బాలీ అన్నాడు. 'అంతా బాగానే వుంది. కాని వాళ్లు నేల విడిచి సాము చేస్తూన్నారు. ఎదిరిబలం తెలీకుండా పోరడం నిష్ప్రయోజనం, ప్రమాదకరం.'

'పరవాలేదు. మనం నెత్తురిస్తే నేతాజీ మనకు స్వాతంత్ర్యం యిస్తానన్నాడు. ఇప్పుడు కాకపోతే వొకప్పుడైనా లోకం గ్రహిస్తుంది. ముందుముందెప్పుడైనా భారత దేశానికి స్వాతంత్ర్యం వస్తే ఆజాద్ హింద్ ఫౌజు సైనికులు బలిపోసిన నెత్తురే కారణం అనుకో. ఇదిసత్యం.'

వాళ్లు రాత్రి రెండు గంటలవరకూ తీవ్రంగా వాదించుకున్నారు. ఆ అభిప్రాయాలలో యేకీభవించలేకపోయేరు. రమను బాలీ తన స్టేషన్ వాగన్‌లో దిగబెట్టేడు.

మళ్లీ మరొక కెరటం తీరాన్ని ముద్దుపెట్టుకుంది. చందమామ నిర్మలాకాశ మ్మీద మందగమనంతో ప్రకాశిస్తున్నాడు. సందేహాంధకార నివృత్తి కలిగినట్టు లోకం కాంతి వహించింది.

* * * * *

నేతాజీ పటాలంమీద శాపపరంపరలు కురిపించిన వారే తిరిగి ఆ వీరులకు కలకత్తాలో బహిరంగ సభలలో పూలమాలలు వేసేరు. పాములకు రెండు నాలికలేగాని మానవులకు చాలా నాలికలు. కెప్టెన్ రమపై ప్రభుత్వం అభియోగం తెచ్చింది. ఆమె నిర్దోషిత్వం రుజువై తిరిగి కలకత్తా వచ్చింది. వచ్చిన మరునాడే అరుణ వద్దకు వెళ్లింది.

'ఏం అరూ అలా చిక్కిపోయేవు. నీ ముఖం పాలిపోయిందికూడా.' అరుణ వెంటనే జబాబు చెప్పలేకపోయింది. కాని కొంతసేపటికి నీరసంగా 'చిక్కిపోయేనా' అంది. రమ ఔనని చెప్పి యెన్నో ప్రశ్నలు తన మామూలు ధోరణిలో వేసింది. అరుణ క్లుప్తంగా జబాబులు చెప్పింది. కాని ఆమెలో యేదో బెంగ వూగిసలాడుతూంది. రమ యిదివరకు లాగ హుషారుగా పకపక నవ్వుతూ, 'బాలీ గురించి అడగవేం!' అంది. అరుణ హృదయం రైలులా పరుగెత్తింది, కాని నిరుత్సాహమేదో కృంగదీసింది. చివరకు బలిమిని మాట పెకిలించుకుని 'అడిగి యేంప్రయోజనం' అంది. గద్గదస్వరంతో తిరిగి 'ప్రేమించడం సులువు గాని అవాంతరాలు దాటడం కష్టం అని పాఠం నేర్చుకున్నా' అని గొణిగింది.

'పొరబడ్డావు అరూ. నా పైపై వికారాలు చూసి నన్నొక బండరాయి అనుకున్నావు కామోసు.

పెట్టిదానా—ప్రేమించడమే మహా కష్టం. ప్రేమకు అవాంతరాలు లేవు.'

అరుణ నేత్రాలు కొంచెం జేవురించేయి. హృదయం దహించుకు పోయింది. కాని వుద్రేకాన్ని ఆపుకుందుకి యత్నించింది. అది గమనించి రమ ఆమె అడగకుండానే చెప్పింది. 'బాలీ యీ ప్రపంచంలో వున్నాడో లేడో చెప్పలేను. నేను నేతాజీ ఫౌజులో చేరిన తరువాత వొక జపానీ రెజిమెంటుతో మా పటాలం కలిసింది. అక్కడకు వుభయులూ పట్టిన ఖైదీలు వచ్చి రెండు మూడు రోజు లుండి, వేరు వేరు స్థలాలకు తీసుకు పోబడేవారు. ఒక రోజున జపానీయులు తెచ్చిన ఖైదీలలో బాలీ అగుపించేడు. గుండు దెబ్బకు అతని కుడిచెయ్యి పోయింది. నే నాతనిని మా రెజిమెంటులోనికి తీసుకుందుకు నా పలుకుబడి యావత్తూ వినియోగించి ప్రయత్నించేను. కాని లాభంలేకపోయింది. రెండు దినాలు తరువాత జపానీయు లతనిని యెక్కడికో తీసుకపోయేరు.'

అరుణ గుండె గుభేలుమంది. తలపై పిడుగు పడ్డట్టయిందామెకు. ఆమెకు రమవొక రాక్షసిలా కనిపించింది. కోపం మరి ఆపుకో లేక పోయింది. 'అందుకేనా నువ్వతనిని ప్రేమించి నన్నవతలికి నెట్టేవు?' 'నే నతనిని ప్రేమించేను. నిజమే. కాని సోదరుడివలె. అతనూ నేను ఆబాల్యస్నేహితులం. ఒక కంచంలో తిన్నాం. కాని నువ్వసలు అతనిని ప్రేమించలేదు.

అతని చుట్టూ గోడలు పెట్టడానికి ప్రయత్నించేవు. ప్రేమ గోడలు పగుల గొడుతుంది గాని పెట్టదు. నేను నా జీవితంలో యెవ్వరినీ సంసార సౌఖ్యం కోసం ప్రేమించలేను. దేశసేవలో మునిగిపోయిన నాకు వీట న్నిటికీ తీరిక లేదు. ఆ రోజున భవానీతో కలిసి మనం వూళ్లోకి వెళ్ళినప్పుడు నువ్వుపడ్డ యాతన గమనించక పోలేదు. నీ నీరసత్వం గ్రహించక పోలేదు!"

అరుణకు దుఃఖం పొంగి వచ్చింది. లేచి వెళ్లి రమ వడిలో తలదూర్చి హోరని యేడ్చింది. 'అక్కా నే నేం చేసేది' అని విలపించింది. అరూ జేలపడకు. అతనిని నువ్వు ప్రేమించు. నీ హృదయాన్ని అతని ప్రేమతో వెలిగించు. ఆ కాంతి జీవించినంత కాలం బాలీ ప్రాణానికి హాని వుండదని నీ హృదయాన్ని నమ్మించు. ఈ నమ్మకంతో జీవితం సాగిపోయినా ఫరవాలేదు. ప్రేమకి కన్నీళ్లే, నిట్టూర్పులే పరమా వధులు.'

ఆ మాటలు అరుణ హృదయంలో వుప్పెన లేవ దీసేయి. కాని ఆ ధాటీని మించి, ఆ యింటిలో పది రోజుల తరవాత మ్రోగబోయే సొన్నాయి భైరవి రాగం హోరెత్తింది. బాలీని గురించి నిరాశ చేసుకుని, తన మేనత్తకొడుకును వివాహం చేసుకుందుకు ఆవేళ వుద యాన్నే అంగీకృతి తెలిపింది. ప్రధానంకూడా జరిగింది.

ఆమె రమ వొడిలో తలదూర్చి వుంచిన నిము షాన్నే అక్కడకు ఘోషాల్ గారు వచ్చేరు. ఆ వృద్ధుడు గడ్డం సవరించుకుంటూ, 'సమయానికి వచ్చేవు రమా...ఒహోహో...ఇప్పుడే కాదు. పది రోజులలో అరుణ పెళ్లి కూతురై వస్తుంది. అప్పుడు దీవించు.' అన్నాడు. రమ పైకి నవ్వింది!

ఇక సముద్రం, ఆ నిల్చున్న వనితా నాకు అగు పిస్తున్నారు. వాళ్లకు అవినాభావం. తరంగాలు లేవు. ఒకటే ప్రశాంతి! ఒకటే చంద్రికా కాంతి.

* * * *

కాలరథగమనంలో దాని చక్రాల క్రింద పడి దేశం మొదట రెండుముక్కలై, తరవాత కరకరనలిగి, నెచ్చనెచ్చటి నెత్తుటి ప్రవాహం పొంగి పొర్లింది. మానవుడిలోని పశువు విజృంభించింది. దాని పాదాల రాపిడికి మానవత్వపు విలువలు పిండిపిండయి పోయేయి.

ఉద్యోగం విరమించి స్వస్థానమైన చిట్టగాంగు చేరుకున్న పీయూష కాంతి చక్రవర్తి కుటుంబం యీ తిరగలిలోపడి చూర్ణమయింది. నరపశువుమీద నరపశు వుకు వుట్టిన ద్వేషాగ్నికి భవాని తలిదండ్రులు, కొంద రన్నదమ్ములు ఆహుతి అయిపోయేరు. ఆమె స్వంత ఆస్పత్రిపై అగ్నిదేవుడు తాండవించేడు. కాందిశీక ప్రవాహంలో ఆమె వొక నీటిబిందువుగా, పదిహే నేండ్ల తమ్ముడూ, వృద్ధురాలైన మేనత్తతో విశాఖ పట్టణం చేరుకుంది.

భవాని విశాఖ పట్టణంలో వైద్యవృత్తి ప్రారం భించింది. సముద్రాని కెదురుగానే వున్న ఆమె బంగళాలోంచి, వెన్నెల రాత్రులు వచ్చి, వొక్కొ క్కప్పుడు తెల్లవార్లూ జ్యోత్స్న చేసే గారడీ గమని స్తూంటుంది. మేఘ సందేశాలు పంపుతూంటుంది జవాబు అపేక్షించకుండా. అంతేగాని నేను ఆమె చేత ఆత్మహత్య చేయించేపాటి శక్తి కలవాడిని కాను. ఆమె ప్రేమలో అంత బలహీన కాదు.

కథవిని వాకలం కన్నీటితో సంతోషించింది.

—